వీనుల విందుగా నిత్య కళ్యాణం

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి ఆలయంలో ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. బుధవారం ఆలయ వైదిక సిబ్బంది ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా ఆలయ సహాయ కార్యనిర్వహణ అధికారి ఆనంద్ కుమార్, పర్యవేక్షణాధికారి పర్యవేక్షణలో స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ప్రాతఃకాల పూజలు సాంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ గోవింద రాజు స్వామి వారిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ కళ్యాణ మండపంలో అధిష్టింప జేసి వేద మంత్రాలు నాధ స్వర మంగళ వాయిద్యాల నడుమ శ్రీ స్వామి వారి నిత్య కళ్యాణం జరిగింది.

జిల్లాలో 156 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: జిల్లాలో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు చేశామని, సంబంధిత అధికార బృందాలను నియమించామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈ నెల 06వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా 156 గ్రామాల్లో సదస్సులను నిర్వహించేందుకు ప్రణాళిక తయారు చేసుకున్నామని తెలిపారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (రెవెన్యూ) ఆర్.పి. సిసోడియా బుధవారం విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఈ మేరకు జిల్లాలో చేపట్టబోయే చర్యలను వివరించారు. ప్రతి మండలానికి ఒక్కో ప్రత్యేక అధికారిని నియమిస్తున్నామని, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో కలిపి బృందాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 11 మండలాల పరిధిలో గుర్తించిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటుపై ఇప్పటికే క్షేత్ర స్థాయి అధికారులకు శిక్షణ అందజేశామని, అవగాహన కల్పించామని పేర్కొన్నారు. సదస్సు జరిగే చోటనే సాంకేతిక సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని, ప్రజల నుంచి వచ్చే వినతులను స్వీకరించి ఆన్లైన్ చేస్తామని వివరించారు. గ్రామీణ పరిధిలో గ్రామల వారీగా, పట్టణ పరిధిలో వార్డుల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, డి.సెక్షన్ సూపరింటెండెంట్ గణపతి ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుడు తూతిక సోమరాజు మృతి

నేతలు ఘన నివాళి

విశాలాంధ్ర - విశాఖ: సీపీఐ, ఏఐటీయూసీ భీమిలి ఏరియా, తగరపువలస సీనియర్ నాయకుడు తూతిక సోమరాజు (84) మంగళవారం మధ్యాహ్నం విశాఖ జిల్లా తగరపువలసలో తన స్వగృహంలో వృద్ధాప్యంతో మృతి చెందారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, సీపీఐ ప్రతినిధి బృందం మృత దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా పైడిరాజు మాట్లాడుతూ నిజాయితీ, నిబద్ధత కలిగిన కామ్రేడ్ సోమరాజుకి భార్య 2010లో మరణించారని, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారని తెలిపారు. సోమరాజు రెండు పర్యాయాలు సిపిఐ తరుపున భీమిలి మున్సిపాలిటీ కౌన్సిలర్ గా బాధ్యతలు నిర్వహించి పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు. చిట్టివలస జూట్ మిల్లు లో మెకానికల్ యూనిట్ లో పని చేస్తూ పార్టీ, యూనియన్ కార్యకలాపాలలో చురుకుగా పని చేస్తూ అందరి మన్నన పొందారని తెలిపారు. సోమరాజు మరణం పార్టీకి, యూనియన్‌కి పూడ్చలేని లోటని నివాళులు అర్పించారు. 3

వారి కుటుంబ సభ్యులకు పార్టీ తరుపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. సోమరాజు మృతదేహానికి నివాళులర్పించిన వారిలో సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు అల్లు బాబురావు, కొండపు ఈశ్వరరావు, కానూరి రాంబాబు, మోర అప్పలరాజు, చిల్ల రాంపైడి, చిల్ల అప్పలసూరి, మావూరి సన్యాసమ్మ, వీర్రాజు, నూలు ఆదినారాయణ, ఎరుసు అప్పల నరసయ్య, పల్లా లక్ష్మణరావు, వానపిల్లి సత్యం తదితరులు ఉన్నారు.

విశాఖలో క్రీడల అభివృద్ధికి సహకరించాలి

శాప్ చైర్మన్ రావినాయుడును కోరిన వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ: విశాఖకు అంతర్జాతీయ గుర్తింపు వచ్చేలా క్రీడల అభివృద్ధికి తగిన సహకారం అందించాలని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడును వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవి ప్రణవ్ గోపాల్ కోరారు. విజయవాడ శాప్ కార్యాలయంలో బుధవారం ఆయన్ని మర్యాద పూర్వకంగా కలిశారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా విశాఖ కైలాసగిరి పై సాహస క్రీడలు ఏర్పాటు చేశామని వివరించారు. శాప్ ద్వారా వీలైనంత వరకు విశాఖ వేదుకగా క్రీడల ఉత్సవాలు జరపాలని, వీఎంఆర్డీఏ నుంచి కూడా సహకారం అందిస్తామని చెప్పారు.

ఆర్టీసీ బస్సు ప్రమాదంలో వృద్ధుడు మృతి

విశాలాంధ్ర - పద్మనాభం: విలస్కాన్ పాలెం గ్రామానికి చెందిన బొడ్డు అప్పలనాయుడు (70)ను పద్మనాభం జంక్షన్లో విజయనగరం నుండి సింహాచలం వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. అప్పలనాయుడును 108 అంబులెన్స్‌లో విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలిస్తుండగా అప్పలనాయుడు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరిపల్లిలో కన్వెన్షన్ హాల్ ప్రారంభించిన ఎమ్మెల్యే పంచకర్ల

విశాలాంధ్ర - పెందుర్తి: పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సింబా రిసార్ట్స్ అండ్ కన్వెన్షన్స్ హాలును జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు బుధవారం ప్రారంభించారు. అనంతరం కన్వెన్షన్ సెంటర్ చుట్టూ పరిశీలించి యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సరిపల్లి ఎంపీటీసీ సభ్యులు గొల్లవిల్లి వెంకటరమణ, సర్పంచ్ గొర్లి రామకృష్ణ, గ్రామ పెద్దలు, పెందుర్తి మండలం ఉమ్మడి ఎన్డీఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ అండ్ ఎమ్ అకాడమీ ప్రారంభం

విశాలాంధ్ర - తగరపువలస: తగరపువలస ఆంధ్ర బాప్టిస్ట్ చర్చ్ ఎదురుగా ట్విల్స్ షోరూం మేడపైన బ్యూటీ ట్రైనింగ్ అకాడమి, లేడీస్ టైలరింగ్ అకాడమిని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దుర్గా శేఖర్, ఆదిమూలం నాగరాజు, వెంపాడ శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా సంస్థ అదినేతలు హని నాగమణి మాట్లాడుతు తక్కువ ఎమౌంట్‌తో స్త్రీలు సొంతంగా కోర్సును నేర్చుకొని ఎంతో మందికి ఉపాధి కల్పించ గల శిక్షణ ఇవ్వబడుతుంది అని చెప్పారు.

శబరిమలై యాత్రకు 36 మంది స్వాములు

విశాలాంధ్ర - ఆనందపురం: ఆనందపురం మండలం పొడుగుపాలెం గ్రామంలో అయ్యప్ప పీఠం నుండి సుమారుగా 50మంది అయ్యప్ప స్వామి మాలాధారణ చేయగా నేటితో దీక్ష పూర్తి కావడంతో శబరిమలై అయ్యప్ప సన్నిధికి 36 మంది స్వాములు 14 మంది స్వాములు ద్వారపూడిలో ఉన్న అయ్యప్ప పీఠానికి ప్రయాణం అవడం జరిగింది. బంటుబిల్లి రాము స్వామి 18వ సారి మాలవేయడంతో ఆయనను ఘనంగా సన్మానించారు.

విభాగాలను పూర్వ విద్యార్థులతో అనుసంధానం చేయండి

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 7వ తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుగుతున్న నేపథ్యంలో విభాగాధిపతులతో ఏయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య జి.శశిభూషణ రావు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులను విభాగంతో అను సంధానం చేయాలని సూచించారు. ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మంగా నిర్వహించే ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి సమన్వయంతో పని చేయాలని అన్నారు.

ప్రతి విభాగంలో ఉన్నతంగా ఎదిగిన పూర్వ విద్యార్థులను ఆహ్వానించడం, వారితో నేటితరం విద్యార్థులను అనుసంధానం చేయడం వారి మార్గదర్శకం, విలువైన సూచనలు ప్రస్తుత తరానికి అందించే దిశగా కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనంజయరావు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహా రావు, కె.సీతామాణిక్యం, డి.నగరాజ కుమారి, ఆర్.పద్మశ్రీ, జి.గిరిజ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడలో బర్గర్ కింగ్ 4వ బ్రాంచ్ ప్రారంభం

విశాలాంధ్ర - పీఎం పాలెం: బర్గర్ కింగ్ ఇండియాలో 480, సౌత్ ఇండియాలో 105, విశాఖలో 4వ బ్రాంచ్‌ను మధురవాడ మిథిలాపూరి వుడాకాలనీ రోడ్‌లో బర్గర్ కింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సౌత్ ఇండియా అధ్యక్షులు కె.వి.సాజు చేతుల మీదుగా బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్.ఐ.ఎఫ్.ఎస్. విద్యా సంస్థల అధినేత సునీల్ మహంతి, పీ.ఎం.పాలెం పిఎస్ సి.ఐ. జి.బాలకృష్ణ, 5వ వార్డ్ కార్పొరేటర్ మొల్లి హేమలత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విశిష్ట అతిథులుగా హాజరైన ప్రముఖ వ్యాపారవేత్తలు నంబూరి వెంకట సంతోష్, ఎన్.రాజన్ రాజు మాట్లాడుతూ బర్గర్ కింగ్ సంస్థకు మంచి ప్రాచుర్యం ఉందని, బర్గర్ కింగ్‌లో లభించే బర్గర్స్, చికెన్ వింగ్స్, పఫ్‌లకు చాలా మంది అభిమానులు వున్నారని, అవి నోరూరించేలా చేస్తాయని, అందులో తాము కూడా ఉన్నామని పేర్కొన్నారు. ఇక్కడ లభించే స్పెషల్ వెజ్ అండ్ నాన్ వెజ్ అన్ని రకాల బర్గర్‌లకు మంచి ప్రత్యేకత ఉందని తాము కూడా వాటిని అమిత ఇష్టంగా తింటామని వక్తలు పేర్కొన్నారు. శరవేగంగా అభివృద్ది చెందుతున్న విశాఖ మధురవాడలో బర్గర్ కింగ్ 4వ బ్రాంచ్‌ను తమ చేతుల మీదుగా ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా మంచి పేరు పొంది నిర్వహిస్తున్న బర్గర్ కింగ్ మధురవాడలో కూడా అదే స్థాయిలో పేరు ప్రఖ్యాతలు గాంచాలని ఆకాంక్షించారు. ఇటువంటి సంస్థను మధురవాడ ప్రజలందరు కూడా ఆదరించి బర్గర్ కింగ్ రుచులను ఆస్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి.ఎం.ఆర్.రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మడికి ఉప్పాడ అభినందనలు

విశాలాంధ్ర - ఆనందపురం: రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్‌గా రెండవసారి పదవీ బాధ్యతలు చేపట్టిన గుమ్మడి గోపాలకృష్ణకు విశాఖ జిల్లా ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పాడ అప్పారావు బుధవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం పేద కళాకారులను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వం కళాకారులకు పింఛను సదుపాయం కల్పిస్తామని చెప్పినప్పటికీ వాస్తవ రూపం దాల్చలేదని తక్షణం అందరికీ పింఛన్లు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో సాంస్కృతిక కళావేదికలు ఏర్పాటుచేసి ఔత్సాహికులకు నటనపై శిక్షణ నివ్వాలని అప్పారావు పేర్కొన్నారు.

బినామీ ఉద్యోగులతో కాలయాపన

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖలో ఉన్న ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం అయినటువంటి ప్రముఖ దేవస్థానంలో బినామీ ఉద్యోగులతో కాలయాపన జరుగుతోందని భక్తులు అంటున్నారు. కొంతమంది సిబ్బంది ప్రముఖ అధికారులను ప్రసన్నం చేసుకుని విధులకు దుమ్మా కొట్టి బినామీలను ఆయా ప్రదేశాల్లో ఉంచి సొంత పనులు చేసుకుని స్వామివారి ఖజానా నుండి నెల వచ్చే సరికి జీతాలు అందుకుంటున్నారు. ఏ ఉద్యోగి అయిన విధులకు సరైన సమయానికి వస్తున్నట్లు తనిఖీ చేసే అధికారి లేరాయే. ఒక వేళ అలా సమయానికి రాలేదని ఏ అధికారి అయినా అడిగిన వారికి పై స్థాయి లేదా రాజకీయ నాయకుల నుండి ఫోన్ రావటం జరుగుతుంది. మనకెందుకు వచ్చిన గొడవ అని అధికారులు చూసి చూడనట్లు ఉంటున్నారని భక్తులు అంటున్నారు.

ప్రొఫెసర్ చంగమయ్యపై దాడి దుర్మార్గం

విశాలాంధ్ర - పెందుర్తి: తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో దళిత ప్రొఫెసర్ చంగయ్యపై దుండగులు దాడి చేయడం అమానుషమని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోని కృష్ణ, విశాఖ జిల్లా అధ్యక్షుడు పేద పెంకి శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్‌పై దాడిని ఖండిస్తూ పెందుర్తి అంబేద్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు మాట్లాడుతూ యూనివర్సిటీలో విధులు నిర్వహిస్తున్న దళిత ప్రొఫెసర్‌పై దాడులు చేయడం బాధాకరమన్నారు. దుండగులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు కరణం తిరుపతిరావు, కనక మహాలక్ష్మి, జంగాల గోపాలరావు, విశ్వనాథం, అప్పలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యల నివారణకు జీవితాన్ని ప్రేమించాలి

విశాలాంధ్ర - మల్కాపురం: ఆత్మహత్యలను నివారించడానికి ప్రతి ఒక్కరూ జీవితం పట్ల అనురాగంతో ఉండాలని, జీవితాన్ని ప్రేమించాలని, ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవాలని పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ పి.జి. వి.ఆర్. నాయుడు (గణబాబు) అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ హాస్పిటల్ ఆవరణలో పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం ఆధ్వర్యంలో ఆత్మహత్యల నివారణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఒత్తిడి ఎక్కువ అవడం వల్ల ఆత్మహత్యలు సంభవి స్తున్నాయని, విద్యార్థుల్లో, యువతలో ఒత్తిడిని తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ప్రతి ఒక్కరికి వారి సమస్యలపై కౌన్సిలింగ్ అవసరమని ఆయన అన్నారు. ఆత్మహత్యలు నివారణను ఒక ఉద్యమంగా చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. పారిశ్రామిక ప్రాంత విలేకరుల సంఘం అధ్యక్షులు ఎం.వి.గిరి మాట్లాడుతూ సామాజిక చైతన్యాన్ని కలిగించడానికి, సామాజిక సేవకు విలేకరులు ఎప్పుడు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ములగాడ రెవెన్యూ అధికారి భుజంగరావు మాట్లాడుతూ యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని ఆత్మవిశ్వాసంతో జీవించాలని అన్నారు. కార్యక్రమంలో మల్కాపురం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, హైస్కూల్ ప్రధానో పాధ్యాయురాలు అరుణ కుమారి, సెయింట్ ఆన్స్ హాస్పిటల్ పరిపాలన అధికారి సిస్టర్ బిన్సీ, ప్రముఖ న్యాయవాది గిల్బర్ట్, సీనియర్ పాత్రికేయులు ఎస్.చలపతిరావు, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, నవజ్యోతి మహిళా సంఘానికి చెందిన వెంకటలక్ష్మి, బౌద్ధ భిక్షు దమ్మానంద, జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయా దేవి, పారిశ్రామిక ప్రాంత విలేకఖరులు, సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు, నవజ్యోతి మ్యాక్స్ మహిళా సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి ఆలయంలో బాలల సంక్షేమ కార్యక్రమాలు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం వార్షిక మార్గశిర మాసోత్సవాలను పురస్కరించుకుని బాలల హక్కులతో ముడిపడి ఉన్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభిస్తుండడం హర్షనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఇటీవల ఈ ఉత్సవాల నిర్వహణపై దేవస్థానం అధికారులతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ జరిపిన సమీక్షలో సూచించిన, ప్రతిపాదించిన వివిధ బాలల సంక్షేమ కార్యక్రమాల ఏర్పాటులో భాగంగా దేవస్థానం అధికారులు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆరు తల్లిపాలు పట్టే ప్రత్యేక కేంద్రాలు, క్యూ లైన్లలో ఉండే పిల్లలకు వేడి పాలు, బిస్కెట్లు పంపిణీ కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం చేతులు మీదుగా ప్రారంభించారు. అనంతరం పిల్లలు, బాలింతలు, గర్భిణీలు, దివ్యాంగ పిల్లల దర్శన సౌలభ్యార్థం ప్రత్యేకంగా ఎటువంటి చర్యలు చేపట్టారో కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఈ.ఈ.రమణ, అసిస్టెంట్ ఇంజనీర్లు, సూర్యారావు, సూరిబాబు, పౌర సంబంధాల అధికారి ప్రసాద్ తదితరులతో కలిసి క్యూ లైన్లలో పరిశీలించారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ ఇటీవల దేవస్థానం అధికారులతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సమీక్షించిన అంశాలు,సూచనలు మేరకు అన్ని సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకై పనిచేస్తున్న అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో నెల రోజులు బాలల హక్కులకు విఘాతం కలగకుండా ఉత్సవాలు విజయవంతం చేయాలని సూచించారు. ఈ ఉత్సవాలు పూర్తయ్యేవరకు తమ కమిషన్ నిత్యం పర్యవేక్షణ జరుపుతూనే ఉంటుందని అన్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి మాట్లాడుతూ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు, ప్రభుత్వ సూచనలతో వారి హక్కులతో అనుసంధానమయ్యే ప్రతీ సంక్షేమ అంశాన్ని ఈ ఉత్సవాల్లో అమలు చేసి మాసోత్సవాలు విజయవంతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లంకిలో కేంద్ర ప్రభుత్వ పథకాలపై శిక్షణ

విశాలాంధ్ర - ఆనందపురం: వెల్లంకిలో స్కూల్ భూసార (సాయిల్) హెల్త్ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలపై శిక్షణ కార్యక్రమంలో భాగంగా జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్రియ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా వ్యవసాయ ఏడీఏ సిహెచ్ సుబ్రహ్మణ్యం పాల్గొని కేంద్ర ప్రభుత్వం పథకం ప్రాధాన్యతను తెలియజేసారు. భూసార పరిరక్షణ, భూసార పరీక్ష గురించి విద్యార్థుల పాత్రను వివరించారు. గతంలో ఇదే విద్యార్థులు రైతులతో సమావేశంలో పాల్గొని మట్టి నమునాలు సేకరించి ఆ మట్టి నమూన పరీక్ష చేసిన పిదప, పరీక్ష ఫలితాల వివరాలను విద్యార్థులే ఈ మీటింగ్‌లో రైతులకు వివరించారు. పంటల సాగులో ఎరువులు, పురుగు మందుల వాడకంపై అవగాహన కలిగి సిఫార్సు మేరకే వాడాలని సూచించారు. కేంద్రియ ఉపాధ్యాయులు, బయాలజీ లెక్చరర్ డా. ఎర్రయ్య మాటాడుతూ విద్యార్థులు వ్యవసాయం భూసార పరీక్షలో మమేకం కావాలని తెలియజేసారు. పరీక్షల అనంతరం భూసార పరీక్షల కార్డులను అనుసరించి ఎరువులు ఏయే మోతాదుల్లో వాడాలో వివరించారు. అనంతరం స్థానిక ఎంపీటీసీ అప్పలనాయుడు చేతుల మీదుగా భూసార పరీక్ష ఫలితల కార్డులను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ హరికృష్ణ, కె.వి పాఠశాల ఉపాధ్యాయురాలు బి.కల్పనా, వీఏఏ రమేష్, రైతులు పాల్గొన్నారు. అనంతరం వెల్లంకి, వేములవలస గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుతం రబీ కాలంలో రాగి పంట సాగును ప్రోత్సహిస్తూ, రాగి విత్తనాలను రాయితీపై అందించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ స్వాతి, రమేష్, రైతులు పాల్గొన్నారు.

ఆంధ్ర ప్రదేశ్ మౌలిక సదుపాయాల వృద్ధికి టాటా మోటార్స్ తోడ్పాటు

విశాలాంధ్ర- విశాఖపట్నం: పెద్ద ఎత్తున పెట్టుబడులు, ప్రాజెక్టులు కీలక పరిశ్రమలకు ఉత్పాదక శక్తి కేంద్రంగా మారడంతో ఆంధ్ర ప్రదేశ్ గణనీయమైన మౌలిక సదుపాయాల వృద్ధిని సాధిస్తోంది. ఈ వేగవంతమైన విస్తరణ నిర్మాణం, మైనింగ్, లాజిస్టిక్స్ కార్యకలాపాలలో పెరుగుదల ద్వారా గుర్తించబడింది. ఈ రంగాలు కార్గో, నిర్మాణ సామగ్రి మొదలైన వాటి తిరుగులేని మొబిలిటీకి మద్దతు ఇవ్వడానికి నమ్మకమైన హెవీ-డ్యూటీ ట్రక్కులను డిమాండ్ చేస్తాయి. టాటా మోటార్స్ పురోగతిలో భాగస్వామి భారతదేశ అతిపెద్ద వాణిజ్య వాహన తయారీదారుగా టాటా మోటార్స్ రాష్ట్ర మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటునందించ డంలో హెవీ-డ్యూటీ టిప్పర్లు, ట్రక్కులు, ట్రాక్టర్‌ల సమగ్ర శ్రేణితో విభిన్న మొబిలిటీ అవసరాలను తీర్చడానికి రూపొందించబడింది. టాటా మోటార్స్ తన ఫ్లాగ్‌షిప్ ప్రైమా ప్లాట్‌ఫామ్‌లో విస్తృత శ్రేణి పరిష్కారాలను అందిస్తుంది.

ఎరువుల ఆవిష్కరణ పర్యావరణ అనుకూల సుస్థిర వ్యవసాయానికి సిఐఎల్, ఐఎఫ్ డీసీ భాగస్వామ్యం

విశాలాంధ్ర- విశాఖపట్నం: భారతదేశంలోని ప్రముఖ అగ్రి-ఇన్‌పుట్ కంపెనీలలో ఒకటైన కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (సిఐఎల్), యుఎస్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తూ ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన లాభాపేక్షలేని సంస్థ అయిన ఇంటర్నేషనల్ ఫెర్టిలైజర్ డెవలప్‌మెంట్ సెంటర్ (ఐఎఫ్ డీసి)లు ఎరువుల అభివృద్ధిలో ఆవిష్కరణ మరియు స్థిరత్వాన్ని పెంపొందించడానికి వ్యూహాత్మక మాస్టర్ పరిశోధన ఒప్పందం పై సంతకం చేశాయి. పోషక సామర్థ్యాన్ని పెంపొందించడం, పంటల ఉత్పాదకతను మెరుగుపరచడం మరియు పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడం లక్ష్యంగా నూతన ఎరువులను పరిచయం చేయడం ద్వారా వ్యవసాయంలో క్లిష్టమైన సవాళ్లను పరిష్కరించే దిశగా ఈ భాగస్వామ్యం ఒక ముఖ్యమైన దశను సూచిస్తుందనీ కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ శంకరసుబ్రమణియన్, ఐఎఫ్ డి సి ప్రెసిడెంట్ హెంక్ వాన్ డుయిజ్న్ తెలిపారు.

తాండవ ఆయకట్టు రైతులకు ఓటు హక్కు కల్పించాలి

విశాలాంధ్ర - నాతవరం: నాతవరం మండలం తాండవ రిజర్వాయర్ నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఇక్కడ గల రైతులకు ఓటు హక్కు లేదని ఉత్తరాంధ్ర చెరువుల పరిక్షణ సమితి అనకాపల్లి జిల్లా కన్వీనర్ లాలం వెంకటరమణారావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు... అన్ని అర్హతలు ఉన్న అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓటు లేవన్నారు. దీనిపై ఏ రాజకీయ పార్టీలు మాట్లాడకపోవడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ఎన్నికలపై స్టే తెచ్చుకోవడానికి హైకోర్టు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇప్పటికైనా రైతులకు ఓటు హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు.

వినూత్న రీతిలో మన ఊరు మన శుభ్రత...!

- కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ శ్రీకారం

విశాలాంధ్ర - ఆనందపురం: మండలంలోని వేములవలస పంచాయతీలో స్థానిక పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ మన ఊరు మన శుభ్రత నినాదంతో వినూత్న పంథా కు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారాలను పడవేయరాదని ఇంటిని శుభ్రంగా ఉంచుకున్నట్లే పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అసలే వర్షాలు విస్తృతంగా కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రజలే అవకాశం ఉందని పరిశుభ్రతతో అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. పారిశుద్ధ్య సిబ్బందితో ప్రతిరోజు ప్రధాన ప్రాంతాల్లో చెత్తాచెదారాలను ఊడ్చి వేయించడం జరుగుతుందన్నారు. అంతేగాక మొబైల్ వ్యాన్ ద్వారా ప్రచారం కూడా నిర్వహిస్తున్నట్లు కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ పేర్కొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్ కన్నా

విశాలాంధ్ర - పెందుర్తి : జీవీఎంసీ 93వ వార్డు, కృష్ణా నగర్ వేదిక కళ్యాణ మండపం వెనుక 11 లక్షలతో చేపట్టిన సిసి రోడ్లు, కాలువలు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ రాపర్తి త్రివేణి కన్నా బుధవారం ఉదయం పరిశీలించారు. జీవీఎంసీ ఏఈ కుసుమ, వర్క్ ఇన్స్పెక్టర్ రవి, రాకేష్. బూతు కమిటీ నాయకులు బండారు సత్యనారాయణ, శ్రీరాములు తదితరులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించిన కార్పొరేటర్ రోడ్డు నిర్మాణ పనులను సమీక్షించారు. అధికారులతో మాట్లాడి పనుల నాణ్యతలో రాజీ పడకుండా శర వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఘంటసాల జయంతి వేడుకలు

విశాలాంధ్ర - యలమంచిలి: అమరగాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు 102వ జయంతి ఉత్సవాలు యలమంచిలి ఘంటసాల కళామందిర్ లో, ఘంటసాల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాడు ఘనంగా జరిగాయి. మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి ఘంటసాల చిత్రపటానికి పూలమాలవేసి జయంతి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ గాయకుడిగా ఘంటసాల వెలుగుం దారని, ఆయన పాటలు ఎంతోమంది

గాయని గాయకులుగా ప్రతిభ కనబరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం 9 గంటల నుండి సాయంత్రం వరకు మాటలు పోటీలు నిర్వహించి మొదటి బహుమతి 5000, ద్వితీయ బహుమతి 3000, తృతీయ బహుమతి 2000, పాల్గొన్న ప్రతి గాయకుడికి కూడా కౌన్సిలేషన్ బహుమతులు ఇవ్వనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఏపీ జగన్నాథం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు రామారావు, కొండలరావు, సాంబశివరావు సభ్యులు గాయని గాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు పుస్తకాలు పంపిణీ చేసిన వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి ప్రణవ్ గోపాల్ కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. తనకు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చేవారు పుష్పగుచ్చాలను తీసుకురావద్దని, వాటికి బదులుగా పుస్తకాలు, పెన్నులు ఇవ్వవచ్చని వాటిని చిన్నారులకు అందిస్తానని ప్రకటించారు. ఆ విధంగా వచ్చిన పుస్తకాలను చదువుకుంటున్న చిన్నారులకు వీఎంఆర్డీఏలో పనిచేస్తున్న క్రింది స్థాయి ఉద్యోగులను గుర్తించి వారి పిల్లలకు అందజేశారు. పుస్తకాలను స్వీకరించిన చిన్నారులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. చిన్నారులు ఉన్నత ఆశయాలతో చదువుకోవాలని దేశానికి విలువైన మానవ వనరులుగా నిలవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. తన ఆలోచనకు మద్దతునిస్తూ పుస్తకాలు అందజేసిన శ్రేయోభిలాషులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో కూడా ఇదే విధానాన్ని కొనసాగిస్తానని తెలిపారు.

నేటి నుంచి జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

విశాలాంధ్ర - భీమిలి: జిల్లా విద్యా శిక్షణ సంస్థ భీమునిపట్నం ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ఆధ్వర్యంలో డిసెంబర్ 5, 6 తేదీలలో కళా ఉత్సవ్ జిల్లా స్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంకు చెందిన పాఠశాలలలో 9 10 11 12 తరగతి చదువుతున్న బాల బాలికలు ఈ పోటీలలో పాల్గొనుటకు అర్హులు పోటీలు ఆరు అంశాలలో నిర్వహించబడును.

1. గాత్ర సంగీతం: ఇందులో శాస్త్రీయ జానపద భక్తి దేశభక్తి గీతాలు సోలో మరియు ఐదుగురు విద్యార్థుల గ్రూపు

2: వాద్య సంగీతం: ఇందులో శాస్త్రీయ సంప్రదాయ మెలోడీ వాద్య పరికరము వాయించడం సోలో మరియు ఐదుగురు విద్యార్థుల బృందం

3. నృత్యం ఇందులో శాస్త్రీయ నృత్యం సోలో, ప్రాంతీయ జానపద సమకాలీన నృత్యాలు ఐదుగురు బృందం

4. నాటక రంగం: ఇందులో ఏకపాత్రాభినయం మరియు మిమిక్రీ సోలో

5. దృశ్యకళలు: ఇందులో 2, 3 సంప్రదాయ బొమ్మల తయారీ ప్రాంతీయ కలల వస్తువుల తయారీ సోలో

6. సంప్రదాయ కథ చెప్పడం. ఇందులో బుర్రకథ ఒగ్గు కథ ఒకరు లేక ఇద్దరు విద్యార్థులు మాత్రమే అర్హులు.

ఈ ఆరు పోటీలలో అర్హులైన వారు ఉపాధ్యాయులతో సహా డైట్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమాలు నిర్వహించబడును. జిల్లా స్థాయిలో ఎంపికైన అభ్యర్థులు తాము ప్రదర్శించే కలాంశం గురించి 100 పదాలకు మించకుండా సమాచారమును ఐదు నిమిషాలకి మించకుండా వీడియోను అందించవలసి ఉంటుంది. పోటీలలో పాల్గొనే విద్యార్థులు తమ మేకప్, ఇతర సామగ్రిని తామే ఏర్పాటు చేసుకోవాలి.

ఒక విద్యార్థి ఒకటి కంటే ఎక్కువ అంశాలలో పోటీ పడరాదు గత సంవత్సరం కళా ఉత్సవంలో ప్రథమ ద్వితీయ, తృతీయ బహుమతులు పొందిన వారు ఈ సంవత్సరం అదే పోటీకి అనర్హులు. పోటీలలో పాల్గొనే విద్యార్థులు తమ ఉపాధ్యాయుల ద్వారా మాత్రమే శిక్షణ పొంది ఉండాలి. వివరాలకు 94414 65299, 90524 23757ను సంప్రదించాలని కోరారు.

22న పివోడబ్ల్యూ విశాఖజిల్లా 7వ మహాసభలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ప్రగతిశీల మహిళా సంఘం (పివోడబ్ల్యూ) విశాఖ జిల్లా 7వ మహాసభలను డిసెంబర్ 22న నిర్వహిస్తున్నామని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటలక్ష్మి, రోహిణి తెలిపారు. ఈ మేరకు నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు.మహాసభల ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాజువాక డ్రైవర్స్ కాలనీలోని ద్రోణంరాజు సత్యనారాయణ కళ్యాణ మండపంలో ఉదయం జెండా ఆవిష్కరణతో సభలు ప్రారంభమౌతాయన్నారు .సభల ప్రాంగణానికి బోయి విజయభారతి ప్రాంగణంగా నామకరణ చేసామని పేర్కొన్నారు. మహిళా సంఘాల జాతీయ కోఆర్డినేటర్ ఝాన్సీ ప్రారంభోపన్యాసం చేస్తారని, రచయిత్రి విజయ భారతి స్మారకోఉపన్యాసం గూడూరు సీతామహాలక్ష్మి, 'ప్రైవేటీకరణ కోల్పోతున్న మహిళల ఉపాధి అవకాశాలపై రచయిత్రి మల్లీశ్వరి ప్రసంగించనున్నారని చెప్పారు.మహిళా ఉద్యమ కర్తవ్యాలపై పివోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి,కార్యదర్శి పద్మ మాట్లాడతారన్నారు. మధ్యాహ్నం ప్రతినిధుల సభ లో కార్యక్రమాలను సమీక్షించుకొని భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్ధేశించుకొని నూతన జిల్లా కార్యవర్గాన్నిఎన్నుకోవటం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఇ. లక్ష్మి, కె. జయమ్మ, హరిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్ ఐక్యూ13 విడుదల

విశాలాంధ్ర/విశాఖపట్నం: అధిక-పనితీరు గల స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐక్యూ తాజాగా భారతదేశపఅత్యంత వేగవంతమైన స్మార్ట్‌ఫోన్ ఐక్యూ 13ని విడుదల చేస్తున్నట్లు ప్రకటించింది. ఇది భారతదేశంలో క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 8 ఎలైట్ చిప్‌సెట్‌తో అమర్చబడిన మొదటి స్మార్ట్‌ఫోన్లలో ఒకటి. ఐక్యూ 13 ధర 12జీబీ+256జీబీ వేరియంట్‌కు రూ.54,999 (సమర్థవంతమైనధర: రూ.51,999), 16జీబీ+512జీబీ వేరియంట్‌కు రూ.59,999 (సమర్థవంతమైనధర: రూ.56,999). ఇది రెండు సొగసైన రంగులలో అందుబాటులో ఉంటుంది. అవి: లెజెండ్ మరియు నార్డో గ్రే. అదనంగా, ఐక్యూ 13 ప్రీ-బుకింగ్ డిసెంబర్ 05, మధ్యాహ్నం 12 గంటలకు అందుబాటులో ఉంటుంది. దాని మొదటి విక్రయం డిసెంబర్ 11, 2024 నుండి మధ్యాహ్నం 12 గంటలకు వివో ప్రత్యేకస్టోర్లు, ఐక్యూ ఇ-స్టోర్, అమెజాన్.ఇన్‌లలో ప్రారంభమవుతుంది. ఐక్యూ 13 వివో ఎక్స్‌క్లూజివ్ స్టోర్లు, ఇతర మెయిన్‌లైన్ స్టోర్లలో కూడా అందుబాటులో ఉంటుంది.

ఈ విస్తరణ ఐక్యూ పరికరాలను అనుభవించే, కొనుగోలు చేసే సౌలభ్యాన్ని నిర్ధారిస్తుంది.